క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో సరస్వతి పూజ



నెల్లూరు (టౌన్): పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ 3వ తేదీ నుంచి ప్రారంభంకానున్న నేపథ్యంలో పొదలకూరురోడ్డు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సరస్వతి పూజను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను ప్రసాదించాలని సరస్వతీదేవిని వేడుకున్నారు. స్కూల్ హెచ్ఎం జయమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నవాజ్‌ఖాన్‌పేట భూములు కాపాడాలి

నెల్లూరు(అర్బన్): నెల్లూరు రూరల్ పరిధిలోని అంబాపురం నవాజ్‌ఖాన్‌పేటలోని ముస్లింలకు చెందిన భూములు అక్రమణకు గురవకుండా కాపాడాలని కోరుతూ మైనార్టీలు కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రత్యేక గ్రీవెన్స్‌లో జేసీ కూర్మనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. మహమ్మద్ జియాఉల్‌హక్ రాష్ట్రాధ్యక్షుడు మౌలానా అబ్దుల్ అజీజ్, నాయకులు అజీజ్ అహ్మద్, అల్లావుద్దీన్, షాహుల్, గౌస్‌బాషా, రెహ్మాన్, షఫీ, రఫీ, హఫీజ్ ఉల్లా, ముజాహిద్, ముజీ, జమీర్, నజీర్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఫర్నిచర్ ఎక్స్‌పో ప్రారంభం



నెల్లూరు(బృందావనం): మినీబైపాస్‌రోడ్డులోని జీపీఆర్ కల్యాణ మండపంలో అమ్మ ఫర్నిచర్ మాల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'ఇంటర్నేషనల్ ఫర్నిచర్ ఎక్స్‌పో–2023ను 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అమ్మ ఫర్నిచర్స్ అధినేతలు గడ్డం సుధాకర్‌రెడ్డి, గడ్డం సుజన్‌రెడ్డి, గడ్డం సుమన్‌రెడ్డి మాట్లాడుతూ వివిధ దేశాల నుంచి దిగుమతి చేసుకున్న 10వేలకుపైగా ఫర్నిచర్ మోడల్స్‌ను ప్రదర్శనలో ఉంచినట్లు తెలిపారు. ఈ నెల 29వ తేదీ వరకు ఫర్నిచర్ ఎక్స్‌పో అందుబాటులో ఉంటుందని, నెల్లూరు పరిసర ప్రాంతాల ప్రజలు ఆదరించాలని కోరారు.

ఎఫ్‌ఏపై చర్యలకు వినతి

నెల్లూరు(పొగతోట): ఉపాధిహామీ పథకం అమలులో అక్రమాలకు పాల్పడుతున్న ఫీల్డ్‌అసిస్టెంట్ (ఎఫ్‌ఏ)పై చర్యలు తీసుకోవాలని సంగం మండలం మర్రిపాడు గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు డ్వామా కార్యాలయంలో పీడీ వెంకట్రావుకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఎఫ్‌ఏ చేతివాటం ప్రదర్శిస్తూ మరణించిన, ఉద్యోగం చేస్తున్న వ్యక్తులకు మస్టర్లు వేసి నగదు స్వాహా చేస్తున్నారని ఆరోపించారు.

రైతులను ఆదుకోవాలి

నెల్లూరు (అర్బన్): అకాల వర్షాలకు పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో జేసీ కూర్మనాథ్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించడంతో పాటు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు. బీజేపీ నాయకులు బుజ్జిరెడ్డి, మిడతల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సొసైటీలు లాభాల బాటలో పయనించాలి



నెల్లూరు రూరల్: సహకార సంఘాలు లాభాల బాటలో పయనించాల్సిన అవసరం ఉందని డీసీసీబీ సీఈఓ శంకర్‌బాబు అన్నారు. కోడూరుపాడు సొసైటీ కార్యాలయంలో లాభాల పంపిణీకి సంబంధించి రైతులకు రూ.10.89లక్షల చెక్కును శుక్రవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సహకారంపైనే సొసైటీలు అభివృద్ధి పథంలో ఉంటాయన్నారు. ఈ ఏడాది కోడూరుపాడు సొసైటీ 13శాతం లాభాలను గడించిందని, భవిష్యత్తులో మరింత వృద్ధి చెందేలా రైతులు సహకారం అందించాలని కోరారు. డీజీఎం ఉష, డీపీడీఎం ప్రదీప్, ఓఎస్డీ శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ వెంకటేశ్వర్లు, మాజీ చైర్మన్లు లేబూరు పరమేశ్వరరెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి, వాల్మేటి లక్ష్మీనారాయణరెడ్డి, సీఈఓ శ్రీధర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): డైకస్‌రోడ్డులోని వైటినాయుడు వీధిలో శుక్రవారం సింగిల్‌నంబర్లాట జూదాన్ని నిర్వహిస్తున్న ప్రగతినగర్‌కు చెందిన షేక్ ఖాదర్ షమి, సయ్యద్ అఖిల్ అబ్బాస్‌ను వేదాయపాళెం ఎస్సై ఎం రాజేశ్‌కుమార్ అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.3,200 నగదు స్వాధీనం చేసుకున్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ ఉపవాస దీక్షలు



ట్రంకురోడ్డులోని మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



మహాత్మాగాంధీనగర్‌లో ఇఫ్తియారి సందర్భంగా ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

నెల్లూరు(బృందావనం): పవిత్ర రంజాన్ మాస ఉపవాస దీక్షలను ముస్లింలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. నింగిలో నెలవంక దర్శనమిచ్చిందంటూ గురువారం మతపెద్దల ప్రకటించడంతో సంప్రదాయంగా తరావీ నమాజు, దువా చేశారు. శుక్రవారం రంజాన్ ఉపవాసదీక్షలను ఆరంభించారు. వేకువజామున ప్రత్యేక ప్రార్థనల అనంతరం చేపట్టిన ఉపవాసదీక్షను సాయంత్రం ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఇఫ్తియారితో విరమించారు. అల్లాహ్‌ను స్మరించుకుంటూ మసీదుల్లో అల్పాహారంగా పండ్లు, తినుబండారాలు, ఆహ్లను ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకుంటూ, బంధుమిత్రులకు రంజాన్ మాస శుభాకాంక్షలు తెలుపుకొంటూ ఆనందోత్సాహాలతో గడిపారు.

క్రీడలతో మానసికోల్లాసం



బ్యాటింగ్ చేస్తున్న జేసీ కూర్మనాథ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): క్రీడలు మానసికోల్లాసం, శారీరక దృఢత్వానికి ఎంతో దోహదపడుతాయని జేసీ రోణంకి కూర్మనాథ్ పేర్కొన్నారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జేఏపీ నెల్లూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా జర్నలిస్టుల క్రికెట్ పోటీలకు రెండోరోజైన శుక్రవారం జేసీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ నిత్యం పనిఒత్తిడిలో ఉండే జర్నలిస్టులు క్రీడలను ఆడడం వల్ల మానసిక వికాసం కలుగుతుందన్నారు. అనంతరం జేసీ కూర్మనాథ్ క్రీడాజట్లను పరిచయం చేసుకుని బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ప్రముఖ అడ్వొకేట్ మలిరెడ్డి కోటారెడ్డి,సెట్నెల్, డీఎస్‌ఏ సీఈఓ డీ పుల్లయ్య, చీఫ్ కోచ్ ఆర్కే యతిరాజ్, జేఏపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ నరేష్‌కుమార్, నెల్లూరు జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు కే నందకిషోర్, జే సునీల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

రెండో రోజు విజేతలు వీరే..

ఏసీస్టేడియంలో జరిగిన తొలి మ్యాచ్‌లో నెల్లూరురూరల్–ఆత్మకూరు జట్లు పోటీ పడగా, నెల్లూరు రూరల్ జట్టు విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో స్టాఫర్స్–కోవూరు జట్ల మధ్యన జరగగా, కోవూరు జట్టు విజేతగా నిలిచింది. అలాగే బుజబుజనెల్లూరులోని సీఏపీ గ్రౌండ్‌లో జరిగిన మొదటి క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో గూడూరు జట్టుపై సర్వేపల్లి జట్టు విజయం సాధించింది. రెండో క్వార్టర్ ఫైనల్స్‌లో సర్వేపల్లి జట్టుపై నెల్లూరు సిటీ జట్టు విజయం సాధించి సెమీఫైనల్స్‌లోకి అడుగుపెట్టింది. శేఖర్‌నాయుడు వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

నేడు ఫైనల్స్

ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో శనివారం ఉదయం సెమీఫైనల్స్, ఫైనల్ మ్యాచ్‌లను నిర్వహించనున్నారు. అనంతరం బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందని జేఏపీ జిల్లా అధ్యక్షుడు నందకిషోర్ తెలిపారు.

రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక గ్రీవెన్స్



నెల్లూరు (అర్బన్): నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్‌లో జేసీ కూర్మనాథ్ శుక్రవారం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించారు. పలువురు బాధితులు తమ సమస్యలపై జేసీకి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రత్యేక గ్రీవెన్స్‌లో వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. నెల్లూరు ఆర్డీఓ మలోలా పాల్గొన్నారు.

యోగా మహోత్సవం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 8 నుంచి ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో మహిళలకు నిర్వహిస్తున్న పోటీల్లో భాగంగా శుక్రవారం యోగా మహోత్సవం నిర్వహించారు. హార్ట్ ఫుల్‌నెస్ సంస్థ, రామచంద్ర మిషన్ సహకారంతో యోగా, ధ్యానంపై శిక్షణ ఇచ్చారు. శిక్షకులుగా ప్రవీణలత, శ్రీనివాసులు వ్యవహరించారు. యోగా పోటీల్లో గెలుపొందిన వారిని సన్మానించి బహుమతులు అందజేశారు. సెట్నెల్ సీఈఓ పుల్లయ్య, డీఎస్‌ఏ చీఫ్ కోచ్ ఆర్కే యతిరాజ్, రామచంద్ర మిషన్ కోఆర్డినేటర్ వెంకటకృష్ణ పాల్గొన్నారు.



సేవా భావంతో వైద్యసేవలు అందించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ పెంచలయ్య

నెల్లూరు(అర్బన్): ప్రభుత్వాస్పత్రులకు వచ్చే రోగులకు సేవా భావంతో వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య నూతన వైద్యులకు సూచించారు. జిల్లా వైద్యశాఖలో నూతనంగా నియమితులైన పది మంది వైద్యులతో సంతపేటలోని తన చాంబర్‌లో డీఎంహెచ్‌ఓ శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యులుగా అడుగుపెట్టిన వారికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో పనిచేయకుండా సేవాభావంతో ప్రభుత్వాస్పత్రుల్లోని రోగులకు వైద్యం అందించేందుకు ముందుకురావడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం సైతం వైద్యరంగానికి పెద్దపీట వేస్తూ వైద్యసిబ్బందిని భర్తీ చేస్తోందన్నారు. జిల్లాలోని 52 పీహెచ్‌సీల్లో వైద్యుల కొరత లేకుండా చూశామన్నారు. అందువల్ల రోగులకు నాణ్యమైన వైద్యసేవలందించాలని కోరారు. నూతన వైద్యుల రాహుల్‌కృష్ణ, జమిమా ప్రత్యూష, తదితరులు పాల్గొన్నారు.

క్షయపై అవగాహన



నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలోని విద్యార్థినులకు క్షయ వ్యాధిపై శుక్రవారం అవగాహన కల్పించారు. అనంతరం క్షయపై విద్యార్థినులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మైక్రోబయాలజీ అధ్యాపకులు కన్యాకుమారి మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రత, మంచి ఆహారపు అలవాట్లను పెంపొందించుకోవాలన్నారు. క్షయ నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కళాశాల ప్రిన్సిపల్ గిరి, వైస్‌ప్రిన్సిపల్ రమణారావు, అధ్యాపకులు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం



నెల్లూరు (అర్బన్): నవాబుపేటలోని బీవీఎస్ బాలికోన్నత పాఠశాలలో విశ్వమాతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలలో 1983 నుంచి 1988 వరకు చదువుకున్న విద్యార్థులు ఒకరికొకరు కలుసుకుని గత స్మృతులను నెమరువేసుకున్నారు. ఫౌండేషన్ అధ్యక్షురాలు దూళిశెట్టి కళ్యాణి ఆధ్వర్యంలో సంగీత గురువు డీవీ సురేష్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు, సింగంశెట్టి మురళీ మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్‌కుమార్‌కు పురస్కారం



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా అబైండింగ్ హోప్ ట్రస్ట్ నిర్వాహకుడు డాక్టర్ నిర్మల్ కుమార్‌కు డీఎంహెచ్‌ఓ పెంచలయ్య శుక్రవారం పురస్కారాన్ని ప్రదానం చేశారు. ప్రతి నెలా 20 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు ట్రస్టు ద్వారా పౌష్టికాహారం అందిస్తూ వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధచూపడంపై పురస్కారాన్ని అందజేశారు.

రోటరీ అవార్డుల ప్రదానం



నెల్లూరు(బృందావనం): శోభకృత్ నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఓ హోటల్‌లో రోటరీక్లబ్ నెల్లూరు సౌత్ ఆధ్వర్యంలో రోటరీ ఒకేషనల్ అవార్డుల ప్రదానోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. సామాజిక, ఆధ్యాత్మిక, కళా, సేవ, తదితర రంగాలకు చెందిన 15 మందికి పురస్కారాలను ప్రదానం చేశారు. రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ వౌవిళ్ళ నాగసతీష్‌బాబు, అధ్యక్ష, కార్యదర్శులు వీ సుధాకర్‌రెడ్డి, జే శ్రీహరి, సభ్యులు కే గురవయ్యానాయుడు, జే గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నవరాత్రి ఉత్సవాలు



నెల్లూరు(బృందావనం): రాంనగర్‌లోని శబరి శ్రీరామక్షేత్రంలో శబరి శ్రీరాముని వసంత నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా మూడోరోజైన శుక్రవారం సీతారామలక్ష్మణ సమేత హనుమంతుడికి తేనెతో అభిషేకం, బిల్వపత్రాలతో అర్చన, మారేడు సమిధలతో హోమం విశేషంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా ఆర్ స్వాతి, ఆర్ శృతి, జే మురళీకృష్ణ, కమల దంపతులు వ్యవహరించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఏకేనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఏపీ టూరిజం విద్యుత్ ఫీడర్‌లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని నెల్లూరు వెస్ట్–1 ఏఈ లక్ష్మీబాయి శుక్రవారం తెలిపారు. కొండాయపాలెంగేట్, పాత మిలటరీ కాలనీ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని వివరించారు.

- రాజేంద్రనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని నెల్లూరు వెస్ట్–2 ఏఈ ఉదయ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. పరమేశ్వరీనగర్‌లోని 1, 2 వీధుల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదని వివరించారు.

సీఎంఏ ఫలితాల్లో జెనెక్స్ విద్యార్థుల ప్రతిభ



నెల్లూరు (టౌన్): ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెట్స్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన సీఎంఏ ఫైనల్ ఫలితాల్లో జెనెక్స్ అకాడమి విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించారని ఆ అకాడమి డైరెక్టర్లు వెంగళరెడ్డి, కొండలరావు తెలిపారు. హరనాథపురంలోని జెనెక్స్ అకాడమిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను శుక్రవారం వారు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జి.ముఖేష్ 496 మార్కులతో 12వ ర్యాంకు సాధించారని తెలిపారు. బీ రామయ్య 462, ఐశ్వర్య 453, సుప్రియ 450, ప్రవీణ్‌కుమార్, హిమజ 442, తేజస్విని 440 మార్కులు సాధించారన్నారు. సీఏంఏ ఇంటర్ ఫలితాల్లో విష్ణుప్రణీత్ 507, చిన్న నారాయణమ్మ , కౌసర్ 497మార్కులు సాధించారని తెలిపారు.

సీఎం జగన్‌కు ధన్యవాదాలు

నెల్లూరు(బృందావనం): దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కోసం రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపడంపై ఆల్‌ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ రాష్ట్రాధ్యక్షుడు ఉరందూరు సురేంద్రబాబు, ఏపీ పాస్టర్స్ ఫెడరేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు రెవ.రాజశేఖర్ దాసరి శుక్రవారం వేర్వేరు ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గత 26ఏళ్లుగా దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని కోరుతూ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గద్దపాటి విజయరాజు బృందం శాంతియుతంగా, ప్రజాస్వామ్యపద్ధతిలో పోరాటం చేస్తోందన్నారు. వారి మనవిని ఆలకించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపడంపై ధన్యవాదాలు తెలిపారు.

రేపు రెడ్‌క్రాస్ సమావేశం

నెల్లూరు(అర్బన్): స్థానిక కస్తూర్బా కళాక్షేత్రంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు, కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెడ్‌క్రాస్ జీవితకాల సభ్యులు రెడ్‌క్రాస్ జారీ చేసిన గుర్తింపు కార్డును, ఒక వేళ కార్డు కోల్పోయి ఉంటే ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా గుర్తింపు కార్డుతో సమావేశానికి హాజరుకావాలని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మత్స్య జయంతి



మత్స్యాలంకారంలో శ్రీకృష్ణుడు

నెల్లూరు(బృందావనం): సుజాతమ్మకాలనీలోని శ్రీకృష్ణయోగ మందిరం ప్రాంగణంలోని అష్టలక్ష్మి ఆలయంలో మత్స్య జయంతిని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీకృష్ణ పరమాత్ముడికి మత్స్యాలంకారం గావించి విశేష పూజలు నిర్వహించారు. మత్స్య గాయత్రి మంత్ర సహిత హోమం చేశారు. ఈ సందర్భంగా శ్రీగణపతి సచ్చిదానంద జ్ఞానబోధ సభ ట్రస్ట్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ మాట్లాడుతూ భగవంతుడి దశావతారాల్లో మొట్టమొదటి అవతారమైన మత్స్యావతారమని తెలిపారు. మత్స్యారాధన, హోమం సర్వదోషాలను పోగొట్టి శ్రేయస్సు,జ్ఞానం ప్రబోధిస్తుందని మత్స్యపురాణం చెబుతుందన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ఎర్త్‌అవర్



ఎర్త్‌అవర్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): పర్యావరణ పరిరక్షణ కోసం శనివారం ఎర్త్‌అవర్‌ను పాటిద్దామని లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు అధ్యక్షుడు వికాస్‌ప్రసాద్ అన్నారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ నెల్లూరు ఆధ్వర్యంలో ఎర్త్ అవర్‌పై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ పాఠశాల, శ్రీవాణి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో వికాస్‌ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతన్నారు. చేయిచేయి కలుపుదాం–పుడమి తల్లిని కాపాడుదాం అనే నినాదంతో ప్రతికుటుంబం శనివారం రాత్రి 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు గంటసేపు ఇళ్లలోని విద్యుత్‌ను స్వచ్ఛందంగా ఆపివేయాలని కోరారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ నెల్లూరు సభ్యులు బనవయ్య, బ్రహ్మదేవి, కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన అవసరం



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ స్వరూప



కిసాన్‌నగర్‌లో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ ప్రమీలమ్మ

నెల్లూరు రూరల్: గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన అవసరమని బుజబుజనెల్లూరు సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వరూప పేర్కొన్నారు. మాదరాజుగూడూరు ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన పోషణ్ పక్వాడ్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని, సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. రక్త హీనతను అధిగమించేందుకు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. బాల్యవివాహాలతో కలిగే అనర్థాలను వివరించారు. పిల్లల ఎత్తు,బరువులను ఎప్పటికప్పుడు గుర్తించాలన్నారు.

నెల్లూరు (వేదాయపాళెం): నగరంలోని కిసాన్‌నగర్–1 అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీలమ్మ చిరుధాన్యాల ఆవశ్యకతను వివరించారు. పుట్టిన బిడ్డలకు ఆరు నెలల నుంచి అనుబంధ ఆహారం అందజేస్తే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రంగడి భూముల లీజు వేలం వాయిదా

నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేటలోని రంగనాథస్వామికి సంబంధించి నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న సుమారు 9 ఎకరాల భూమి లీజుకు శుక్రవారం నిర్వహించిన వేలంపాట వాయిదాపడింది. ధరావత్తుదారులు నిబంధనలు పాటించని కారణంగా వేలాన్ని నిలుపుదల చేశారు. వివరాలు..రంగనాథస్వామికి సంబంధించి నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల లీజు వేలానికి సంబంధించి ముందుగా రూ.27లక్షలు, రూ.20 లక్షలు, రూ.17 లక్షలు, రూ.17లక్షల చొప్పున ఈఎండీగా చెల్లించాల్సి ఉంది. లీజుకు సంబంధించి ఈ–టెండర్లు, సీల్డ్ టెండర్లు రాకపోవడంతో శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. దేవాదాయశాఖ తిరుపతి ఆర్జేసీ సాగర్‌బాబు, జిల్లా అధికారి పీ శ్రీనివాసులురెడ్డి, ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు, ఆలయ చైర్మన్ శివకుమార్‌ఆచారి, సభ్యులు, మాజీ సభ్యుల సమక్షంలో జరిగిన బహిరంగ వేలంలో పాటదారులు నిబంధనల మేరకు ధరావత్తు చెల్లించకుండా, నామమాత్రం రుసుం చెల్లించి వేలం పాటల్లో పాల్గొన్నారు. దీనిపై కొందరు మాజీ సభ్యులు, ప్రస్తుత సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో బహిరంగ వేలాన్ని వాయిదావేశారు. మళ్లీ బహిరంగ వేలం ఎప్పుడు నిర్వహించేది తెలియజేస్తామని ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు.

వృద్ధురాలిని చంపుతామని బెదిరించి..

- నగలు దోపిడీ చేసిన దుండగులు

నెల్లూరు(క్రైమ్): ఇద్దరు యువకులు పక్కాగా రెక్కీ వేసి ఇంట్లో వృద్ధురాలు ఒంటరిగా ఉంటున్న విషయాన్ని నిర్ధారించుకున్నారు. అనంతరం అద్దెకు ఇల్లు కావాలంటూ ఇంట్లోకి ప్రవేశించారు. ఆమెను నిర్బంధించి ఒంటిపైనున్న బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. ఈ ఘటన నాగేంద్రనగర్‌లో చోటు చేసుకుంది. వివరాలు..నాగేంద్రనగర్‌కు చెందిన ఉప్పు శ్రీరాములు,వెంకటశేషమ్మ దంపతులు. భర్త మరణానంతరం ఆమె తన కుమారుడు నవీన్‌తో కలిసి ఉంటోంది. నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తున్న ఆమె కరోనా సమయం నుంచి ఇంటి వద్దే ఉంటోంది. నవీన్ రెండు నెలలుగా భార్యతో పాటు ఇందుకూరుపేటలో నివాసం ఉంటున్నారు. వెంకటశేషమ్మ ఒక్కటే ఒంటరిగా ఉంటోంది. కుమారుడు రోజూ వచ్చి తల్లితో కొద్దిసేపు గడిపి వెళ్లేవాడు. వెంకటశేషమ్మ మొదటి అంతస్తులో ఉంటూ కిందపోర్షన్‌ను అద్దెకు ఇచ్చేందుకు టూలెట్ బోర్డు పెట్టింది. గురువారం నవీన్ తల్లి వద్దకొచ్చారు. ఇద్దరూ కలిసి బంగారు నగలను లాకర్‌లో పెట్టివచ్చారు. రాత్రి సుమారు 7.30గంటల ప్రాంతంలో తెల్లటీషర్టులు, షార్టు వేసుకుని మొహానికి మాస్కులు ధరించిన ఇద్దరు వ్యక్తులు అద్దెకు ఇల్లు కావాలంటూ వచ్చారు. వారు ఇంటికోసం వచ్చి ఉంటారని భావించి నవీన్ ఇందుకూరుపేట వెళ్లిపోయాడు. రాత్రి 9.30గంటల ప్రాంతంలో ఇద్దరు యువకులు వృద్ధురాలు ఉంటున్న పైపోర్షన్‌కు వెళ్లారు. ఇంటి అద్దె గురించి మాట్లాడుతూ తాగేందుకు నీరు కావాలని అడిగారు. వెంకటశేషమ్మ నీరు తెచ్చేందుకు లోనికి వెళుతుండగా ఇద్దరు వెళ్లి ఆమెను దివాన్‌కాట్‌పై తోసేశారు. అరిస్తే చంపుతామని బెదిరించి నోటిని దిండుతో కప్పేటి ఆమె మెడలోని రెండున్నర సవర్ల బంగారు చైన్, చెవుల కున్న అర సవర కమ్మలను దోచుకుని పరారయ్యారు. బెదిరిపోయిన వృద్ధురాలు తేరుకుని కేకలు వేసినా ప్రయోజనం లేకుండా పోయింది. ఆమె జరిగిన విషయాన్ని కుమారుడికి తెలియజేయగా నెల్లూరుకు చేరుకుని శుక్రవారం నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వివాహితకు అసభ్యకర మెసేజ్‌లు

నెల్లూరు(క్రైమ్): వివాహితకు అసభ్యకరమైన మెసేజ్‌లు పెట్టడంతో పాటు లైంగికదాడికి యత్నించిన నిందితుడిపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు..వసంతోపుసెంటర్‌లో నివాసం ఉంటున్న ఓ వివాహిత ఫోన్‌కు గుర్తుతెలియని వ్యక్తి అసభ్యకరమైన మెసేజ్‌లు పెట్టసాగాడు. ఈ విషయాన్ని ఆమె తన భర్తకు తెలియజేయగా ట్రూకాలర్‌లో చూడగా మిధున్‌రెడ్డి అనే పేరు వచ్చింది. దీంతో ఈ నెల 20న వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 22న నిన్ను, నీ భర్తను చంపేస్తానని వివాహితకు మిధున్‌రెడ్డి మెసేజ్ చేశాడు. దీంతో సదరు వ్యక్తి ఎవ్వరో తెలుసుకునేందుకు వివాహిత తెలియకుండా మిధున్‌రెడ్డి నంబర్‌కు మెసేజ్ చేసింది. దీంతో ఆయన అదేరోజు అర్ధరాత్రి దాటిన తర్వాత ఆమె ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి లైంగిక దాడికి యత్నించాడు. ఆమె ప్రతిఘటించి పెద్దగా కేకలు వేయడంతో పక్కగదిలో ఉన్న భర్త, చుట్టపక్కల వారు వచ్చి మిధున్‌రెడ్డిని పట్టుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో వివాహితను వరండా మీద నుంచి కిందకు తోయబోగా, అక్కడున్నవారు మందలించి డయల్ 100కు ఫిర్యాదు చేశారు. పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు బాధితురాలు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలోనూ నిందితుడిపై ఫిర్యాదు చేసి ఉండడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎస్పీ అభినందనలు

నెల్లూరు(క్రైమ్): డాక్టర్ విజయకుమార్ హత్యకేసులో ఐదుగురు ముద్దాయిలకు జీవితఖైదు పడేలా చేసిన పీపీ రవికుమార్, కేసులో సాక్ష్యాలను పకడ్బందీగా పొందుపరిచిన నాటి వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ పీ సుబ్బారావు, కోర్టు మానిటరింగ్ ఎస్‌ఐ డేవిడ్, కోర్టు సిబ్బంది వెంకటేశ్వర్లును ఎస్పీ సీహెచ్ విజయారావు శుక్రవారం అభినందించారు. అలాగే బాలుడి నవ్యసాక్షిక్ కిడ్నాప్ కేసును గంటల వ్యవధిలో ఛేదించి సురక్షితంగా తల్లి ఇంద్రజకు అప్పగించిన నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డి, దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ సీహెచ్ సీతారామయ్య, క్రైమ్‌పార్టీ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.పోలీసు అధికారులు, సిబ్బందికి జీవితాంతం రుణపడి ఉంటామని బాలుడి తల్లి కృతజ్ఞతలు తెలిపారు.

వివాహిత అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): ఇంట్లో నుంచి వివాహిత అదృశ్యమైన ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు..సుందరయ్యనగర్‌కు చెందిన ఓ వివాహిత నిత్యం ఫోన్‌లో మాట్లాడుతుండగా భర్త మందలించాడు. ఈ నెల 21న ఆమె ఇంట్లో నుంచి అదృశ్యమైంది. బాధిత కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టిన ఆమె జాడ తెలియరాలేదు. వివాహిత అదృశ్యం వెనుక అదే ప్రాంతానికి చెందిన శివరాం ప్రమేయం ఉండవచ్చని బాధితులు సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.